**కథ**

# కథకు థీమ్ దొరికింది!

**బస్సు దిగి, ఆఫీసునుంచి ఇంటి కొస్తున్నాడు సుబ్బారావు. దారిలో అతడి కాలనీ మిత్రులు కలిసారు. వారితో మాట్లాడుతూ నడుస్తుంటే కాలనీ పోస్ట్‌మేన్ "సార్" అని పిలుస్తూ వెంటబడ్డాడు. అతడి చేతి లోని కవర్లను చూసిన సుబ్బారావుకు పై ప్రాణాలు పైనే పోయాయి. పరుగుల రాణి పిటి ఉషను గుర్తుకు తెచ్చుకుని అక్కణ్ణించి పరుగెత్తాడు. అలా ఒక కేంటిన్‌లోకి మెల్లగా వెళ్ళి టీ ఆర్డరిచ్చి "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాడు. క్రితంసారి జరిగిన చేదు అనుభవం అతడిని అలా పరుగులు పెట్టించింది.**

పది రోజుల క్రితం ఆఫీసునించి కాలనీ మిత్రులతో వస్తుంటే పోస్ట్‌మేన్ ఒక కవర్ల కట్ట చేతికిచ్చి ''సార్ పోస్టు!'' అన్నాడు. సుబ్బారావు ఆ పోస్టును వేగంగా తన సంచీలోకి తోసేసాడు. ''ఏమిటండీ! అవి'' అన్నారు కాలనీ మిత్రులు ఆసక్తిగా.

సుబ్బారావు గొంతులోంచి మాటరాకముందే పోస్ట్‌మేన్ ''అవి సార్‌గారి తిరిగొచ్చిన కథలండీ వాటి బరువు మొయ్యలేక రోజు రోజుకీ నడుం ఒంగిపోతోంది. అదేదో సినిమాలో చూపించినట్టు ఒక వేన్ మాట్లాడుకుంటే బావుంటుంది కథలు మోసుకు రావడానికి'' అన్నాడు.

కాలనీ మిత్రులు ఆ మాటలకు ఫక్కున నవ్వారు. సుబ్బారావు తల తీసేసినట్లయింది. ఆ విషయం అంతటితో ఆగలేదు. కాలనీలో అతడి గురించి జోకులు ప్రచారంలోకి వచ్చాయి.

''వచ్చిందండీ మళ్ళీ సునామి, అది మరి సుబ్బారావుగారి కథల రూపంలో సుమీ!'' అంటూ కాలనీ కవి హైకూ వదిలాడు.

-అలా సుబ్బారావు కాలనీవాసులకు ఒక వినోద వస్తువు అయ్యాడు. అందుకే పోస్టుమేన్ పిలుపునకు భయపడి అక్కణ్ణించి పరిగెత్తాడు. అరగంటసేపు కేంటిన్‌లోనే గడిపి ఇంటికి బయలుదేరాడు. ఇంటి గుమ్మం ఎక్కక మునుపే అతడి పిల్లలు ఎదురై ''నాన్నా నీవి నాలుగు కథలు తిరిగొచ్చాయి'' అన్నారు గట్టిగా అరుస్తూ.

''ష్! అరవకండిరా'' అంటూ వాళ్ళ నోళ్ళు మూసి ఇంట్లోకి నడిచాడు.

వంటగదిలోని అతడి శ్రీమతి, స్వరం గట్టిగా పెంచి ''మళ్ళీ కథలు తిరిగొచ్చాయా? ఆ కథల కోసం స్టాంపులకు, తెల్లకాగితాలకు చేసిన ఖర్చుతో నాకు నాలుగు పట్టు చీరలు వచ్చేవి'' అంది కోపంగా.

''అబ్బ చచ్చిన పామును చంపకే!'' అన్నాడు సుబ్బారావు బాధగా.

వెంటనే వంటగదిలోని సుబ్బలక్ష్మి గబగబా వచ్చి.

''అలా బాధపడుతూ కూర్చునే బదులు మన కాలనీలోకి కొత్తగా 'సీతయ్య'గారనే సీనియర్ రచయిత వచ్చారు. ఆయన దగ్గరకెళ్ళి సలహాలు తీసుకోవచ్చు కదా, మీ కథలు ఎందుకు తిరిగొస్తున్నాయో తెలుస్తుంది'' అంది.

''మరి సీతయ్య ఎవ్వరిమాట వినడు అని విన్నాను.'' అన్నాడు సుబ్బారావు దిగులుగా.

''మీరు చెప్పింది నిజమే! సీతయ్య ఎవ్వరి మాట వినడు, వాళ్ళావిడ మాట తప్ప, ఆవిడ మా మహిళామండలి సభ్యురాలు, నేను ఫోన్ చేసి చెపుతాను, మీ తిరిగొచ్చిన కథలతో తక్షణం వెళ్ళండి'' అంది.

సుబ్బలక్ష్మి మాటలకు సుబ్బారావు 'కరణేషు మంత్రి' అనుకుంటూ సీతయ్యగారి ఇంటికి బయలుదేరాడు.

★ ★ ★

సీతయ్యగారి ఇంటి తలుపు కొట్టగానే ఆయన భార్య రాములమ్మ తలుపుతీసి, ''రండి మీ శ్రీమతి ఫోన్ చేసారు, మా సీతయ్యగారి కథలు మీకులాగానే మొదట్లో తిరిగొచ్చేవి. ఆ అనుభవం తోనే మీకు సలహాలు చెపుతారు'' అంది. వెంటనే సీతయ్యగారు అక్కడ ప్రత్యక్షమై భార్య మాటలకు నీరసంగా ముఖంపెట్టి విధి లేక చిన్న నవ్వు నవ్వి ''మీరు ఎవరి సాహిత్యం ఎక్కువ చదువుతారు?'' అన్నాడు.

ఆ మాటలకు సుబ్బారావు ''నేను ఎవరి సాహిత్యమూ చదవనండీ, అలా చదివితే వారి ప్రభావం నాపై పడుతుందని నా భయం'' అన్నాడు గంభీరంగా.

ఆ మాటలకు సీతయ్యగారు గాఢంగా నిట్టూర్చి ''మీ కథలు ఇలా ఇవ్వండి చదువుతాను!'' అంటూ సుబ్బారావు చేతిలోని కథల్ని తీసుకున్నారు.

రెండు నిమిషాలు చదివి గబగబా లోపలకు పరిగెత్తి ఏదో టాబ్లెట్‌తో తిరిగొచ్చి, ''రాములమ్మా, కాస్త కాఫీ తీసుకురా, తలపోటుగా వుంది'' అన్నారు.

ఆయన మాటలకు సుబ్బారావు సిగ్గుపడ్డాడు. 'బహుశా ఉదయం నించీ తలపోటు వుందేమో, నేను వచ్చిన తరువాత అయివుండదు' అనుకుని సమాధానపడ్డాడు. అయినా ఆ విషయం సుబ్బారావుని కృంగదీయడంతో ''సార్ తలపోటు ఎప్పటినించీ?'' అన్నాడు సందేహ నివృత్తికి.

వెంటనే సీతయ్యగారు, ''ఇదిగో క్షణం క్రితం నించీ'' అనడంతో సుబ్బారావు మరింత కృంగిపోయి తలొంచుకున్నాడు.

ఇంతలో రాములమ్మగారు కాఫీ కప్పులతో వచ్చారు. సీతయ్యగారు టాబ్లెట్ లోపలకు పంపి మళ్ళీ కథల్లోకి తలదూర్చి, ''అయ్యా మీ కథల్లో అచ్చుతప్పులు ఎక్కువగా ఉన్నాయి, ఆ ముసలావిడకు డబ్బై సంవత్సరాలు, ఆవిడకు గర్భం-అంటూ రాసారు. వాస్తవానికి ఆవిడకు గర్వం అని కదా మీ ఉద్దేశ్యం?'' అన్నారు సీతయ్య.

- ఆ మాటలకు సుబ్బారావు సిగ్గుపడి ''ఔనండీ కథ పంపే ముందు చదువుకోవలసింది, అయినా నాకు మళ్ళీ మళ్ళీ చదవడం బోర్'' అని మనసులోని మాట బైట పెట్టేసాడు.

''మీరు రాసింది మీకే చదవటం బోరయితే, అవతల రోజుకి వందలకొద్దీ కథలు చదివే సంపాదకులవారికి ఎంతబోరు!'' అన్నాడు కొంచెం కోపంగా సీతయ్య.

ఆ మాటలకు సుబ్బారావుమౌనం వహించి, క్షణం తర్వాత ''సారీ సార్, మీరు చెప్పింది నిజమే. అందుకే ఏమైనా సలహాలు ఇచ్చి పుణ్యం కట్టుకోండి'' అన్నాడు వినయంగా.

సీతయ్యగారు అరగంటసేపు కథలు రాయడంలో పాటించవలసిన నియమాలు, సూచనలు చెప్పడంతో సుబ్బారావుకు జ్ఞానోదయం అయింది. సీతయ్యగారికి, రాములమ్మకూ కృతజ్ఞతలు చెప్పి ఇంటి ముఖం పట్టాడు సుబ్బారావు.

★ ★ ★

డా.ఎమ్.సుగుణరావు



సీతయ్యగారి సూచనలతో తన తిరిగొచ్చిన కథల్ని తాలింపుతో తిరగమోత వేసి పంపాడు. అవి మళ్ళీ తిరిగొస్తే మషాలా దినుసుల్లాంటి వాక్యాలతో తిరగరాసి వదిలేవాడు. తినగ తినగ వేము తియ్యగా నుండు నానుడిలా చదవగా, చదవగా సంపాదకులవారికి అతని కథలు రుచించడం మొదలుపెట్టాయి. అలా అతడి కథలు పత్రికల్లో ప్రచురణకు నోచుకున్నాయి. సమస్య ఇక్కడే మొదలయ్యింది. 'ఇంతకాలం కథలు తిరిగొస్తున్నాయని బాధపడ్డాను. ఇప్పుడు కథలు ప్రచురింపబడుతున్నా రావలసిన గుర్తింపు ఏది?' అనే బాధకు లోనయ్యాడు.

''నేను కథా రచయితనండోయ్!'' అని స్వయంగా సుబ్బారావే ప్రచారం చేసుకోవడంతో ఆఫీసులో అందరూ 'సొంతడబ్బా' అంటూ ఏడిపించడం మొదలుపెట్టారు.

'ఇలా బాగోలేదు. పరోక్షంగా గుర్తింపు తెచ్చుకోవాలి. తను కథను ఒకరి ద్వారా చదివిస్తే ఆ మొదటి పాఠకుడే తనకు కావలసినంత ప్రచారం చేస్తాడు' అనుకున్నాడు. అలా ఆఫీసులో ఒకాయనను కలిసాడు. ఆయన అప్పుడప్పుడు వీక్లీలు కొనడం సుబ్బారావుకు తెలుసు. తన కథ పంపిన వీక్లీ కనబడకుండా దాచి, ''సార్ మీరు ఏ పత్రికలు కొంటారు అన్నాడు?'' గుంభనంగా.

''నేను దీపావళికి మాత్రమే కొంటాను'' అన్నాడాయన.

''దీపావళి సంచికల్లో మంచి కథలుంటాయా?'' అన్నాడు సుబ్బారావు ఆశగా.

''కాదండీ, ఆ సంచికలు పెద్ద సైజుల్లో వుంటాయి, దీపావళికి మతాబులవీ చేసుకోవడానికి కాగితాలు కావాలి కదా!'' అన్నాడాయన.

సుబ్బారావు ఆ మాటలకు షాక్ తిని, ఆ తర్వాత ఇంకో ఆఫీసు మిత్రుడిని కలిసాడు. ఈసారి ప్రశ్న మార్చి, ''మీరు పత్రికల్లో ఏ శీర్షికలు చదువుతారు?'' అన్నాడు.

''నేను వారఫలాలు మాత్రం చదువుతాను'' అన్నాడా వ్యక్తి క్లుప్తంగా.

రెండోసారీ సుబ్బారావుకు అలా ఆశాభంగం కలిగింది. ఈసారి డైరెక్టుగా రంగంలోకి దిగాడు. ఆఫీసులోనే మరో సహచరుడిని కలిసి, ''మీరు ఎలాంటి కథలు చదువుతారు?'' అన్నాడు.

అతను వెంటనే కన్నుగీటి ''శృంగార కథలు చదువుతాను'' అన్నాడు.

సుబ్బారావుకు ఆనందం కలిగింది. 'తనూ అలాంటి కథే రాసాడు. ఆ పత్రికలో పడిన తన కథ చూపించాడు. ఆ సహచరుడు కథపేరు, రచయిత పేరు చదివి, ''సుంకర సుబ్బారావు, మీ పేరే, ఇంటిపేరూ కలిసింది, ఆ రచయిత పేరు,

మీ పేరు ఒకటే కావడం భలే యాధృచ్ఛికం, లేకపోతే మీ పేరుతో ఆయన కథ రాసాడా?''- అన్నాడు సుబ్బారావుని నిశితంగా చూసి, నీకు కథలు రాసేంత దృశ్యం లేదు అన్న ధోరణిలో.

సుబ్బారావుకి ఆ ఆఫీసు మిత్రుడి మాటలతో జీవితం మీద విరక్తి కలిగింది. బాగా ఆలోచించాడు. రెండు రోజులు అంతర్మధనంతో ఒకసారి ఎవరో చెప్పిన సలహా గుర్తుకొచ్చింది. 'పొడుగ్గా కనబడాలంటే పొట్టివాళ్ళ పక్కన నడవాలి. ఒక గీతను చెరపకుండా పెద్దది చెయ్యాలంటేదాని పక్కన ఇంకో పెద్ద గీతను గియ్యాలి. అలా రచయితగా నిలదొక్కుకున్న తనకు గుర్తింపు రావాలంటే రచయితలు అవుదామనుకునే, వాళ్ళతో తిరగాలి, వారి మధ్య తను వెలిగిపోతాడు.'

అలా ఆలోచించిన సుబ్బారావు అన్వేషణలో కథలు రాద్దామనుకునే ఔత్సాహికులు, రాసి పంపినా అవి తిరిగొస్తే ఏం చెయ్యాలో తెలియని వర్ధమానులు పదిమంది దాకా దొరికారు. తన ఇల్లే స్థావరంగా సాహితీ సమావేశాలు మొదలు పెట్టి తమ వేదికకు రసం, అంటే 'రచయితల సంఘం' అని పేరు పెట్టాడు. అలా అతడికి ఆ రచయితల మధ్య మహారచయితగా గుర్తింపు వచ్చింది.

సుబ్బారావు శ్రీమతికి అతడి 'రసం' వరస అసలు నచ్చలేదు. ప్రతీ ఆదివారం భర్త అంతేసిమందిని వెంటేసుకుని రావడం, వాళ్ళందరికీ గంట గంటకూ టీలు, కాఫీలు అందివ్వడం, ఆమెకు విసుగెత్తిపోయింది. రెండు, మూడుసార్లు సుబ్బలక్ష్మి అతడికి వార్నింగ్ ఇచ్చింది. అయినా రసం సమావేశాలు ఇంట్లోనే కొనసాగిస్తూ వస్తున్నాడు సుబ్బారావు.

★ ★ ★

ఒక పత్రిక వారు హాస్యకథల పోటీ ప్రకటించారు. ఒక ఆదివారం ఉదయం ఇంట్లో కూర్చుని ఆ కథల పోటీకి కథ రాయటం కోసం థీము గురించి సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు సుబ్బారావు. ఎంత జుట్టు పీక్కున్నా హాస్య కథకు కావలసిన ఇతివృత్తం దొరక లేదు సుబ్బారావుకు. ఇంతలో బిలబిల మంటూ అతడి 'రసం' సాహితీ మిత్రులు వచ్చేసారు. ఆరోజు కథా వస్తువు అనే విషయం మీద సుబ్బారావే చర్చ మొదలుపెట్టాడు.

''కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవు. జీవితమే కథలకు ముడిసరుకు'' అన్నాడు సుబ్బారావు.

గంభీరంగా, గతంలో సీతయ్యగారు తనకు చెప్పిన విషయాలు గుర్తుకు తెచ్చుకుంటూ.

వెంటనే ఒక కుర్ర రచయిత, ''సార్ మీరు రాసిన కథలన్నీ అలా మీ జీవితంలోంచి ఊడిపడినవేనా?'' అన్నాడు.

''ఔను దాంట్లో సందేహం లేదు'' అన్నాడు సుబ్బారావు ఆవేశంగా.


''అయితే గతంలో మీరు రాసిన శృంగార కథ మీ జీవితంలోంచి వచ్చిందేనా?!'' అన్నాడు ఇంకో ఔత్సాహికుడు.

ట్రాన్స్‌లోంచి బైటకు రాని సుబ్బారావు ''ఔను బాబూ ఎన్నిసార్లు చెప్పాలి'' అన్నాడు గట్టిగా.

అవతల వంట గదిలోనుంచి సుబ్బారావు మాటలు విన్న అతడి శ్రీమతి, 'రచయితగా నిన్ను నిలబెట్టింది నేను, అలాంటి నన్నే పడగొడతావా సుబ్బూ' అనుకుంటూ కోపంతో ఊగిపోయింది.

''అయితే ఆ కథలో మీరు రాసినట్టు ఆ వర్షపు రాత్రిలో ఆ అజ్ఞాతసుందరితో సరస సల్లాపం సాగించిన ఆ పెళ్ళయిన ఆసామి మీరేనా?!'' అన్నాడు చర్చ ప్రారంభించిన కుర్ర రచయిత సందేహ నివృత్తికి.

సుబ్బారావుకు కోపం వచ్చేసింది.



''బాబూ ఎన్నిసార్లు చెప్పాలి? ఆ కథలో రాసిన ప్రతి సన్నివేశం నేను అనుభవించి రాసిందే!'' అన్నాడు గట్టిగా.

సుబ్బారావు మాటలు వంటగదిలోంచి విన్న సుబ్బలక్ష్మి వేగంగా వచ్చి, ''నిజంగా ఆ శృంగార కథ మీ నిజ జీవితపు ముడిసరుకా? లేక హాస్యానికంటున్నారా?'' అంది తను తెచ్చిన వస్తువును చెంగుచాటున దాచిపెట్టి.

''నిజం..నీ మీదొట్టు'' అన్నాడు సుబ్బారావు తను ఏం మాట్లాడుతున్నాడో మర్చిపోయి.

సుబ్బలక్ష్మి తను రహస్యంగా తెచ్చిన వస్తువును బయటకు తీసి, కోపంగా అతడి బుర్రమీద ప్రయోగించింది.

అంతే! ఆ వస్తువు కలిగించిన నొప్పిని బట్టి అది అప్పడాలకర్రగా సుబ్బారావు గ్రహించి వాస్తవంలోకి వచ్చాడు. తను ఊహించి రాసిన ఆ శృంగార కథకు అనవసరంగా బిల్డప్ ఇచ్చి భార్య ఆగ్రహానికి గురయ్యానని అర్థం చేసుకున్నాడు. అంతలోనే 'యురేకా' అంటూ గావుకేక పెట్టాడు.

తను కొట్టడం వల్ల భర్తకి మతి భ్రమించిందేమోనని అతడి శ్రీమతి భయపడుతూ, ''క్షమించండి, మీ ఆవేశం చూసి నేనూ ఆవేశపడ్డాను'' అంది.

''ఫరవాలేదు, మంచి థీము దొరికింది, కామెడీ కథ రాయడానికి, ఇది మాత్రం నిజంగా అనుభవంలోంచి వచ్చిందే'' అన్నాడు సుబ్బారావు నెత్తి మీద కట్టిన బొప్పిని తడుముకుంటూ.

## 'బంపర్' గిట్టుబాటు!

**హిందీలో వచ్చిన 'మాలామాల్ వీక్లీ' సినిమాని రాజేంద్రప్రసాద్-రిషీ-ఫర్జానాలతో తెలుగులో 'భాగ్యలక్ష్మీ బంపర్ లాటరీ'గా తీస్తున్నారు కదా! త్వరలోనే రిలీజ్ కానున్న ఈ సినిమా సుమారు 2.5 కోట్ల బడ్జెట్‌తో తయారవుతుంటే ఇందులో 61 లక్షలు శాటిలైట్ ప్రసార హక్కుల ద్వారా అప్పుడే సమకూరాయట. ఓ ప్రముఖ టీవీ చానెల్ వారు తమ చానెల్ కోసం ఈ సినిమాని 61 లక్షలు పెట్టి కొన్నారని టాలీవుడ్ వార్తలు. అంటే దాదాపు నాలుగో వంతు పెట్టుబడి వచ్చేసినట్టే.**